క్లుప్తంగా

రక్తదానం.. ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న ఇందిరాల రమేష్

హుజూర్‌నగర్ : రక్తదానం ప్రాణదానంతో సమానమని డీఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ దగ్గుబాటి బాబారావు అన్నారు. గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామానికి చెందిన ఓ మహిళకు శస్త్ర చికిత్స నిమిత్తం రక్తం అవసరం కావడంతో వారు డీఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్‌ను సంప్రదించారు. దీంతో శనివారం ఆయన పట్టణానికి చెందిన ఇందిరాల రమేష్‌తో మాట్లాడి రక్తదానం చేయించారు. రక్తదాతను పలువురు అభినందించారు.

రేపు మట్టపల్లిలో గాయత్రీమాత పూజలు

నేరేడుచర్ల : మఠంపల్లి మండలం మట్టపల్లిలోని విశ్వబ్రాహ్మణ సత్రంలో ఈనెల 12వ తేదీన ఉదయం 8 గంటలకు విశ్వకర్మ, గాయత్రీమాత పూజలు నిర్వహించనున్నట్లు విశ్వబ్రాహ్మణ సత్రం అధ్యక్షుడు బొడ్డుపల్లి సుందరయ్య, ప్రధాన కార్యదర్శి తూనికపాటి జగన్నాధచారి, కోశాధికారి కొండా త్రయంబకాచారి తెలిపారు. శనివారం స్థానికంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. పూజా కార్యక్రమాల్లో నేరేడుచర్ల, గరిడేపల్లి, పాలకవీడు మండలాలతో పాటు జిల్లా నలుమూలల నుంచి విశ్వబ్రాహ్మణులు పెద్దఎత్తున పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు.

స్నేహితుల చేయూత



ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రం అందజేస్తున్న మిత్రులు

మఠంపల్లి : మండల కేంద్రానికి చెందిన జిట్టా సైదులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో 1996- 97లో అతనితో పాటు పదవ తరగతి చదివిన చిన్ననాటి మిత్రులు సైదులు కుమార్తె పేరున రూ.1 లక్ష ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి సంబంధిత పత్రాలను శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. స్నేహానికి విలువ ఇచ్చి తోడ్పాటునందించిన వారికి కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు. సైదులు కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని మిత్రులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆదూరి కిషోర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, కారింగుల నాగరాజుగౌడ్, వల్లపుదాసు వీరస్వామిగౌడ్, శివారెడ్డి, ముక్కంటి, శ్రీకృష్ణాచారి, రవీంద్రనాయక్, వల్లపుదాస్ రవిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పీవీ రావుకు ఘన నివాళి



డాక్టర్ పీవీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచన నిలయంలో శనివారం మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పీవీ రావు జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సాలే రామారావు, జాతీయ కమిటీ ఉపాధ్యక్షుడు పోతుల జ్ఞానయ్య, రాష్ట్ర నాయకులు తుమ్మల రాంబాబు, చప్పిడి సావిత్రి, మండల అధ్యక్షుడు పి.రాజు, వినోద్, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

గరిడేపల్లి : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను వెంటనే నిర్వహించాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు జోగు అరవింద్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ పోరుబాటలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారినికి కృషి చేస్తామని తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

మునగాల : రాష్ట్రంలో డిగ్రీ విద్య నభ్యసిస్తున్న 8 లక్షల మంది విద్యార్థులకు గత మూడేళ్లగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని మండల కేంద్రానికి చెందిన న్యాయవాది మిర్యాల మంగయ్య గౌడ్ కోరారు. ఈమేరకు శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రికి ఆయన ఈమెయిల్ పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజులు చెల్లించకపోవడంతో డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు పరీక్షలు నిలిపివేశాయని తెలిపారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల మంది డిగ్రీ విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న దాదాపు 3లక్షల మంది విద్యార్థులు డిగ్రీ పరీక్షలు రాయక ముందే ఎడ్‌సెట్, లాసెట్, పీజీ సెట్ ప్రవేశ పరీక్షలు రాయాల్సి వస్తున్నందున వీరు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారన్నారు. డిగ్రీ విద్యార్థులకు వీలైనంత త్వరగా పరీక్షలు నిర్వహించేలా అధికారులు చొరవ తీసుకోవాలని మంగయ్యగౌడ్ కోరారు.

జోరుగా అక్రమ మైనింగ్



సీతారాంపురం గుట్టల్లో మైనింగ్ పనుల్లో నిమగ్నమైన యంత్రాలు

- ప్రభుత్వ అనుమతులు లేకుండానే సీతారాంపురం గుట్టల్లో తవ్వకాలు
- గుట్టలను గుల్ల చేస్తున్న అక్రమార్కులు
- రాత్రివేళ బాంబులు పెట్టి బ్లాస్టింగ్‌లు

చిలుకూరు : చిలుకూరు మండలం సీతారాంపురం గ్రామ పరిధిలోని గుట్టల్లో అక్రమంగా మైనింగ్ జోరుగా కొనసాగుతోంది. ప్రభుత్వ అనుమతి లేకుండానే తవ్వకాలు జరుపుతున్నారు. రాత్రి సమయంలో గుట్టల్లో పెద్దపెద్ద బాంబులతో పేల్చి తెల్లవారిన తరువాత టిప్పర్లతో యథేచ్ఛగా రాయిని తరలించుకుపోతున్నారు కొందరు అక్రమ వ్యాపారులు. ఇదంతా కళ్ల ముందే జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

979 సర్వే నంబర్ భూమిలో..

చిలుకూరు రెవెన్యూ పరిధిలోని సీతారాంపురం గ్రామానికి చెందిన శ్మశాన వాటిక, మండల మెగా పల్లె ప్రకృతి వనానికి వెళ్లే దారిలో 979 సర్వే నంబర్‌లో వందల ఎకరాల భూమి ఉంది. ఇందులో ప్రభుత్వ, పట్టా భూములు ఉన్నాయి. అయితే ఈ సర్వే నంబర్‌లో రెవెన్యూ అధికారులు పలుమార్లు సర్వేలు చేసినా పూర్తి స్థాయిలో ఏ రైతు భూమి ఎక్కడ ఉందో ఎవరిది పట్టా భూమి అనే విషయాన్ని తేల్చలేదు. దీన్ని ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు కొందరు గుట్టలను గుల్లచేస్తూ రాయి వ్యాపారం చేస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు.

పరిశీలించి, చర్యలు తీసుకుంటాం



సీతారాంపురం పరిధిలోని గుట్టలో తవ్వకాలు జరుపుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. మైనింగ్ అనుమతులకు సంబంధించిన కాగితాలను పరిశీలించి, పూర్తిస్థాయిలో విచారణ జరుపుతాం. అక్రమంగా మైనింగ్ జరుపుతున్నట్లు తేలితే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– ధ్రువకుమార్, తహసీల్దార్, చిలుకూరు

రాత్రయిత్రే బాంబుల మోత!

979 సర్వే నంబర్‌లో గల ప్రభుత్వ భూమిలోని గుట్టల్లో అక్రమంగా మైనింగ్ కోసం కొందరు వ్యాపారులు రాత్రివేళ పెద్ద బాంబులు పెట్టి పేల్చేస్తున్నారు. అనంతరం అందులో బయటపడిన నాపరాయిని జేసీబీల ద్వారా టిప్పర్లలో నింపి క్రషర్‌లకు తరలిస్తున్నారు. రోజుకు వందల సంఖ్యలో టిప్పర్ల ద్వారా అక్రమంగా రాయి తరలిస్తున్నారు. ఈ వ్యవహారం పట్టపగలే కొనసాగుతున్నా.. రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. సామాన్యులు ఎవరైనా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే నోటీసులు ఇచ్చి వారిని భయాందోళనకు గురిచేస్తారు. కానీ, ఇక్కడ గుట్టల్లో పెద్ద ఎత్తున మైనింగ్ జరుగుతున్నా పట్టించుకునే నాథులే లేకుండా పోయారు. ఇదిలా ఉంటే పేలుళ్ల శబ్దానికి అటు వైపు వెళ్లాలంటేనే భయమవుతోందని, అధికారులు స్పందించి గుట్టల్లో అక్రమ మైనింగ్‌ను అడ్డుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

భారత సైన్యానికి మద్దతుగా ర్యాలీ



భారత సైన్యానికి మద్దతు తెలుపుతున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

కోదాడరూరల్ : పాకిస్తాన్ ఉగ్రవాదులపై దాడి చేస్తున్న భారత సైన్యానికి మద్దతుగా కోదాడ పట్టణ బాయ్స్ హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం కోదాడ పట్టణంలో హైస్కూల్ వద్ద నుంచి రంగా థియేటర్ సెంటర్ వరకు జై జవాన్, జైకిసాన్ అంటూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం దాడులకు ప్రతీకారంగా భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్‌తో పాక్ ముష్కరులను మట్టుబెట్టి పాక్‌కు తగిన బుద్ధి చెప్పిందని అన్నారు. ఈ సమయంలో 140 కోట్ల భారత ప్రజలు ఇండియన్ ఆర్మీకి మద్దతుగా నిలుద్దామన్నారు. అనంతరం యుద్ధంలో అశువులు బాసిన అమరజవాన్లకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు ఉన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామ పంచాయతీ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో శనివారం కోదాడ పట్టణానికి చెందిన కె.నరేష్ (పోలీస్) పుట్టిన రోజుతో పాటు ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం పైనంపల్లి గ్రామానికి చెందిన కె.గోపి -శ్రావణి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా వృద్ధులు, అనాథలు, మానసిక వికలాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ వేమూరి సత్యనారాయణ, దాతల కుటుంబ సభ్యులు, ఆశ్రమ వ్యవస్థాపకురాలు నాగిరెడ్డి విజయమ్మ, కోఆర్డినేటర్ వాచేపల్లి జ్యోతి పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే సమాజంలో గుర్తింపు



నేరేడుచర్ల : జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ రవీందర్

నేరేడుచర్ల : క్రీడల్లో రాణిస్తే సమాజంలో గుర్తింపు ఉంటుందని నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్ అన్నారు. శనివారం నేరేడుచర్ల పట్టణంలోని ఐదవ వార్డులో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, స్నేహ భావాన్ని పెంపొందిస్తాయన్నారు. అనంతరం అంబేద్కర్ యూత్‌ను ఎస్‌ఐ అభినందించారు. కార్యక్రమంలో అలక సైదిరెడ్డి, నూకల సందీప్‌రెడ్డి, మన్నెం దుర్గారావు, ఉపేందర్, కృష్ణ, నాగరాజు, మలిగిరెడ్డి మల్లారెడ్డి, భగవంతరెడ్డి, ఉదయ్‌సింహారెడ్డి, మన్నెం సతీష్, వెంకన్న, శ్రీను, భిక్షం, సందీప్, సైదులునాయుడు, సురేష్, ధనుష్, చారి, ఉదయ్, చందు, సతీష్ తదితరులు ఉన్నారు.

సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

నేరేడుచర్ల : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు కోరారు. శనివారం నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న సమ్మర్ క్యాంపును ఆయన పరిశీలించి మాట్లాడారు. క్యాంపులో విద్యార్థులకు క్రీడలు, యోగా, ధ్యానం, చెస్, క్యారమ్, చేతి రాత, సాంస్కృతిక అంశాలలో మెళకువలు నేర్పుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమ్మర్ క్యాంపు శిక్షకుడు, పీడీ యాదగిరి, ఉపాధ్యాయులు సైదులు, వెంకటేశ్వర్లు, బాలు, లాల్‌సాహెబ్ తదితరులు ఉన్నారు.



నేరేడుచర్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు



హుజూర్‌నగర్ : పట్టుబడ్డ మైనర్లు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న సీఐ చరమందరాజు



కోదాడరూరల్ : మైనర్లు, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ శివశంకర్



మునగాలలో మైనర్లు, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ రామకృష్ణారెడ్డి

మునగాల : మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని మునగాల సీఐ రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. మోతె, నడిగూడెం, మునగాల పోలీస్‌స్టేషన్ల పరిధిలో గత వారం రోజులుగా ద్విచక్ర వాహనాలు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన 40 మంది మైనర్లు, వారి తల్లిదండ్రులకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం మునగాల మండల కేంద్రంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మైనర్లకు వాహనాలు ఇస్తే ఇచ్చిన వారిపైన, మైనర్ల తల్లిదండ్రులపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లు నడిపిన వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. మునగాల, నడిగూడెం ఎస్‌ఐలు ప్రవీణ్‌కుమార్, అజయ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే రూ.25 వేల జరిమానా

కోదాడరూరల్ : మైనర్లకు వాహనాలు ఇస్తే కొత్త నిబంధనల ప్రకారం గరిష్ఠంగా రూ.25వేల జరిమానా విధించనున్నట్లు కోదాడ పట్టణ సీఐ కె.శివశంకర్ తెలిపారు. కోదాడ పట్టణ పరిధిలో సోమవారం నుంచి శనివారం వరకు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన 45 మంది మైనర్లకు వారి తల్లిదండ్రులతో సహా ఎస్పీ ఆదేశాల మేరకు కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. ఒక్కొక్కరికి రూ.1500 చొప్పున జరిమానా విధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రోడ్డు నియమాలు, మోటారు వాహన చట్టం ప్రకారం మైనర్స్ డ్రైవింగ్ చేస్తూ ఒక్కసారి పట్టుబడితే వారికి 25 సంవత్సరాల వయస్సు వరకు డ్రైవింగ్ లైసెన్స్ ఇవ్వడం కుదరదని, సంవత్సరం వరకు వెహికిల్ రిజిస్ట్రేషన్ నిలిపివేయబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు రంజిత్‌రెడ్డి, సుధీర్‌కుమార్, ట్రాఫిక్ ఎస్‌ఐ మల్లేష్, ఏఎస్‌ఐలు ఖయ్యుం, శ్రీనివాసులు, రమేష్, సిబ్బంది ఉన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే ప్రమాదాలు

హుజూర్‌నగర్ : మైనర్లు వాహనాలు నడపడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని సీఐ చరమందరాజు అన్నారు. హుజూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని ఐదు మండలాల్లో వాహనాలు నడిపి పట్టుబడ్డ మైనర్లు, వారి తల్లిదండ్రులకు శనివారం హుజూర్‌నగర్‌లో సీఐ ఆధ్వర్యంలో మైనర్ డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్ల లోపు వారు వాహనాలు నడపవద్దని సూచించారు. మైనర్లు వాహనాలు నడిపితే వారితో పాటు తల్లిదండ్రులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పట్టుబడ్డ వాహనాలకు జరిమానా విధించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు ముత్తయ్య, నరేష్, లక్ష్మీనర్సయ్య, రవీందర్, బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులపై విద్యార్థుల ఆసక్తి

- జిల్లా యువజన క్రీడల సమాఖ్య, తెలంగాణ రైజింగ్ ఆధ్వర్యంలో శిబిరాలు
- వాలీబాల్ క్రీడపై శిక్షణ
- ఈనెల చివరి వరకు నిర్వహణ



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

కోదాడరూరల్ : ప్రస్తుత విద్యార్థులు ఆటలను దూరం పెట్టి చదువుకే పరిమితమవుతున్నారు. ఆటలు ఆడేందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహకం లేకపోవడం, పాఠశాలల్లో కూడా క్రీడల నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంటుండడంతో ఎక్కువ మంది విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. కొందరు గ్రామీణ విద్యార్థులు ఆటలాడుతున్నా రాణించలేకపోతున్నారు. దీంతో వేసవి కాలంలో సెలవులను సద్వినియోగం చేసుకొని క్రీడల్లో నైపుణ్యం పొందేందుకు జిల్లా యువజన క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నారు. కోదాడ మండలంలోని గుడిబండ, కోమరబండ, కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో తెలంగాణ రైజింగ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం వాలీబాల్ శిక్షణ శిబిరాలను ఈనెల 1 నుంచి నెల చివరి వరకు నిర్వహిస్తున్నారు. ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు, సాయంత్రం ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకు కోచ్‌లు ఉచిత శిక్షణ ఇస్తున్నారు.


ఆసక్తి చూపుతున్న విద్యార్థులు

క్లాసికల్ గేమ్‌గా ఉండే వాలీబాల్ క్రీడలో శిక్షణ పొందేందుకు విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారు. పాఠశాలలకు సెలవులు కావడంతో పాటు పిల్లలు ఇంటి వద్ద ఉంటూ అల్లరి చేయకుండా, ఫోన్‌లకే పరిమితం కాకుండా ఉంటారనే ఆలోచనతో తల్లిదండ్రులు ఈ వాలీబాల్ శిక్షణ ఇప్పించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కోచ్‌లు వాలీబాల్‌లో అత్యంత శ్రద్ధ కనబరుస్తున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వారిని జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆడించేందుకు వారితో స్ట్రైకింగ్, సర్వీస్, డిఫెన్స్ వంటి వాటిలో మెళకువలు నేర్పుతున్నారు.

ఫిట్‌నెస్‌పై శిక్షణ..

వాలీబాల్ కోర్టులోకి దిగే ముందు విద్యార్థులకు కోచ్‌లు ఫిట్‌నెస్‌పై అవగాహన కలిగిస్తున్నారు. క్రీడాల్లో రాణించాలంటే ఫిట్‌నెస్ ఎంతో అవసరమని చెప్తూ వారితో రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్‌తో పాటు వాలీబాల్ క్రీడకు కావాల్సిన పలు రకాల వామప్స్ వంటి వాటిపై దాదాపుగా గంట సేపు శిక్షణ ఇచ్చి ఆ తర్వాత గేమ్‌ను స్టార్ట్ చేస్తున్నారు.


మెళకువలు నేర్పిస్తున్నారు



సమ్మర్ క్యాంపులో వాలీబాల్ క్రీడాలో ఎన్నో విషయాలు తెలిసాయి. ఆటలో పాయింట్లు ఎలా రాబట్టాలో వంటి మెళకువలను కోచ్‌లు ఈ క్యాంపులో నేర్పిస్తున్నారు. దీంతో పాటుగా ఫిట్‌నెస్ ఎలా పెంచుకోవాలో అవగాహన కూడా వచ్చింది. రాష్ట్ర స్థాయిలో ఆడటమే నా లక్ష్యం.

– వేముల భవానీ, కొమరబండ


ఆటతో పాటు ఫిట్‌నెస్ పెరిగింది



వేసవి సెలవుల్లో నేను వాలీబాల్ శిక్షణను సద్వినియోగం చేసుకుంటున్నాను. ఇక్కడ కోచ్‌లు ప్రత్యేకంగా ఇస్తున్న శిక్షణ నాకు ఎంతో ఉపయోగపడుతుంది. ఈ సమ్మర్ క్యాంపులో ఇస్తున్న శిక్షణతో నాకు ఆటతో పాటు ఫిట్‌నెస్ కూడా పెరిగింది.

– బాలకృష్ణ, బాయ్స్ హైస్కూల్, కోదాడ

సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీస్తున్నాం. ఆటపై మక్కువ ఉన్న వారిని ప్రత్యేకంగా ప్రోత్సహిస్తాం. వారికి ఆటల్లో అన్ని మెళకువలు నేర్పి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆడించడమే లక్ష్యంగా శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి.

– పార్వతి, పీడీ, గుడిబండ

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్ : బంగారం దుకాణల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ చరమందరాజు వాటి యజమానులకు సూచించారు. శనివారం హుజూర్‌నగర్ సీఐ కార్యాలయం ఆవరణలో హుజూర్‌నగర్‌లోని బంగారం దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాలకు మంచి లాకర్ సిస్టం, తగిన భద్రతతో కూడిన షట్టర్లు ఏర్పాటు చేసుకోవాలని ఆయన తెలిపారు. కొంతమంది గుంపుగా వచ్చి దుకాణదారులను ఏమార్చి ఏ విధంగా దొంగతనం చేస్తారో వారికి వివరించారు. రాత్రి వేళలో సెక్యూరిటీ గార్డును నియమించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ముత్తయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం హామీలు అమలు చేయాలి



మహాసభ కరత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : ఎన్నికల సందర్భంగా కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు కోరారు. కోదాడ పరిధిలోని బాలాజీ నగర్ ఎల్‌బీసీ బిల్డింగ్స్‌లో ఈనెల 13న జరగనున్న బీసీ హక్కుల సాధన సమితి మూడవ జిల్లా మహాసభ కరపత్రాన్ని శనివారం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, నాయకులు యల్లావుల రమేష్, జక్కుల రమేష్, కొమ్మరాజు వెంకట్, కందుల వెంకటేశ్వర్లు, స్టాలిన్, జడ వెంకన్న, జక్కుల శ్రీను, కృష్ణ, బత్తిని మల్లయ్య, జక్కుల రమణ, సుందరయ్య పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : సూర్యాపేట పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజు యజ్ఞాచార్యులు నల్లాన్ చక్రవర్తుల హరిచరణ్ ఆచార్యులు సూర్యకిరణాల ద్వారా అగ్నిని ప్రజ్వలింప చేసి యాగశాలలోని యజ్ఞకుండంలో అగ్నిని ప్రతిష్ఠించి మూల మంత్ర హోమాలు నిర్వహించారు. తదనంతరం ధ్వజస్తంభం వద్ద ధ్వజారోహణం నిర్వహించి గరుడ ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. సాయంత్రం యాగశాలలో హోమాలు నిర్వహించి దేవతాహ్వానం జరిపించారు. ప్రధానార్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరెడ్డి, తూడి దేవేందర్ రెడ్డి, ఝాన్సీ, లక్ష్మి, బజ్జూరి కృష్ణయ్య, రమేష్, మాధవరావు, మంజుల, అరుణ, ఉమారాణి, వికాస తరంగిణి, ఆండాళ్ గోష్టి భక్త బృందం పాల్గొన్నారు.

నేడు శ్రీసుదర్శన నారసింహ యాగం..

ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో భారత సైనికులకు మద్దతుగా విజయసాధన కోసం శ్రీ సుదర్శన నారసింహ యాగం నిర్వహిస్తున్నట్లు దేవాలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలచార్యులు శనివారం తెలిపారు.

జవాన్ మురళీనాయక్‌కు నివాళి



నడిగూడెంలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న స్థానికులు

నడిగూడెం : భారత్,పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో వీరమరణం పొందిన తెలుగు జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి శనివారం నడిగూడెంలో యువత నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందిటి నవీన్‌కుమార్, బాణాల నాగరాజు, ఎండి.రఫి, దున్నా ప్రవీణ్, షేక్.ఇంతియాజ్, మేకల వీరయ్య, చింతల రమేష్, పల్లపు నాగేశ్వరరావు, అంజన్, వినయ్, వెంకటేష్, లక్ష్మణ్, నాగరాజు, హైమద్, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

'గోపా' బలోపేతానికి కృషిచేయాలి

సూర్యాపేట అర్బన్ : గోపా (గౌడ్ అఫీషియల్స్-ప్రొఫెషనల్స్ అసోసియేషన్) బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బండి సాయన్న గౌడ్ కోరారు. సూర్యాపేట పట్టణంలోని ఎస్‌ఎల్‌ఎస్ స్కూల్‌లో శనివారం గోపా జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సర్దార్ సర్వాయి పాపన్న, ధర్మభిక్షం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోపా జిల్లా కన్వీనర్ అల్లాడి సత్యనారాయణగౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కోశాధికారి మొగిలి రఘునాథ్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారింగుల భిక్షమయ్యగౌడ్, చీకూరి సత్యంగౌడ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పులుసు సాయిబాబాగౌడ్, గుడిపూడి సాయి, వేణుగౌడ్, మీరయ్య గౌడ్, నాతి సవిందర్‌గౌడ్ పాల్గొన్నారు.

మట్టి కుండలకు గిరాకీ



హుజూర్‌నగర్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న కుండలు

హుజూర్‌నగర్ : ఎండలు మండిపోతుండడంతో పేదోడి ఫ్రిడ్జ్ (మట్టి కుండలు) కు గిరాకీ పెరిగింది. వేసవి కాలంతో పాటు మట్టికుండలో నీరు తాగితే ఆరోగ్యానికి మేలు అని వైద్యులు సూచిస్తుండడంతో హుజూర్‌నగర్‌లో మట్టి కుండల విక్రయాలు పెరిగాయి. ప్రజల కోరిక మేరకు స్థానిక వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి లారీలలో కుండలను తెప్పించి పట్టణంలో విక్రయిస్తున్నారు. కుండ సైజును బట్టి ఒక్కో కుండ రూ.2 వందల నుంచి 3 వందల వరకు విక్రయిస్తున్నారు.